

మందమర్రిలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య

# సభను విజయవంతం చేయాలి

- ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య

మందమర్రి, నవంబర్ 6 : మందమర్రి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాలు, పట్టణాలు, గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య కోరారు. స్థానిక బీఆర్ఎస్ బీ1 కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ పర్యటన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. ఎన్నడూ లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో తరలి రావాలని ఆయన కోరారు. పట్టణంలోని అన్ని వార్డుల ప్రజలు ఇండ్లకు తాళాలు వేసి, డప్పుచప్పుళ్లతో తరలిరావాలని తెలిపారు. సింగరేణి కార్మికవర్గానికి సీఎం కేసీఆర్ ఎంతో మేలు చేశారని అన్నారు. సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి, సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలకాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే రవీందర్, ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర ఉపాధ్యక్షుడు బడికెల సంపత్, రీజినల్ కార్యదర్శి ఓ రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





కళాజాత ప్రదర్శనతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

# కాసిపేట-2 ఇంక్లైన్‌పై కళాజాత ప్రదర్శన

కాసిపేట, నవంబర్ 6 : మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కార్మికులకు ఓటుపై అవగాహన కల్పించారు. కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికల్లో కార్మికులు 100 శాతం పోలింగ్ అయేలా కృషి చేయాలని, ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆటాపాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ముల్కల్ల మురళి, వెల్తూరి పోశం, మామిళ్ల లచ్చన్న, రాంటెంకి రాజా తిరుపతి, వడకపురం రవి కుమార్, కొప్పర్తి రవీందర్, సల్లూరి కృష్ణయ్య, గొడిశెల కృష్ణ, డీఆర్డీఏ ఎస్‌బీఎం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామగుండం సీపీ రెమా రాజేశ్వరి

# సీఎం సభకు భద్రతా ఏర్పాట్లు చేయాలి

బెల్లంపల్లి, నవంబర్ 6 : బెల్లంపల్లి తిలక్‌స్టేడియంలో ఈ నెల 8న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పోలీసు అధికారులకు సూచించారు. తిలక్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం సభ ఏర్పాట్లను ఆమె సోమవారం పరిశీలించారు. ఏర్పాట్ల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మెయిన్ ఎంట్రెన్స్ వద్ద పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీపీ వెంట డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఏసీపీ పంతాటి సదయ్య, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు, తిరుపతి రెడ్డి, మోహన్ తదితరులు ఉన్నారు.



ఆర్కే-6 గనిపై మాట్లాడుతున్న మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు, చిత్రంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు

## కేసీఆర్ సాహసోపేత నిర్ణయం..

# 'కారుణ్య' నియామకం

- సింగరేణిలో 16 వేల మంది యువకులకు ఉద్యోగాలు
- కార్మికులపై సీఎం కేసీఆర్‌కు ప్రేమ
- ఓటుతో ఆయనను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేయాలి
- మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు

శ్రీరాంపూర్, నవంబర్ 6 : సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు పోగొట్టడమే కాకుండా జాతీయ కార్మిక సంఘాలు కోర్టుకు వెళ్లి అపే కుట్రలు చేసినా ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులపై ఉన్న ప్రేమతో సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని, కారుణ్య ఉద్యోగాలు కల్పించారని మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఆర్కే-6 గనిపై సోమవారం ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులకు కారుణ్య ఉద్యోగాలు అమలు చేయడం వల్ల నేడు సింగరేణిలో 16 వేల మంది యువకులకు ఉద్యోగాలు దొరికాయన్నారు. నోటిఫికేషన్ల ద్వారా కూడా 4 వేల ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. కార్మికులకు 15 శాతం నుంచి 32 శాతానికి సంస్థ లాభాల్లో వాటా ఇచ్చినట్లు గుర్తుచేశారు. కార్మికుల పోరాటం వల్ల ఢిల్లీలో కదలికలు వచ్చి, రాష్ట్ర సాధనకు బాటలు పడ్డాయన్నారు. అందుకే సీఎం కేసీఆర్‌కు కార్మికులపై ప్రేమ ఉన్నదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండడం వల్లే కార్మికులకు అన్ని విధాలా ఆర్థిక ప్రయోజనాలు కలుగుతున్నాయని చెప్పారు. కార్మికులు కారు గుర్తుకు ఓటు వేసి, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాలని కోరారు. కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారని చెప్పారు. కేసీఆర్ ఉన్నంత వరకు సింగరేణిని ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు వెంగళ కుమారస్వామి, కాశీరావు, పెట్టం లక్ష్మణ్, బ్రాంచ్ కార్యదర్శి పానుగంటి సత్తయ్య, పిట్ కార్యదర్శి ఇప్ప భూమన్న, నాయకులు అన్వేష్‌రెడ్డి, పొగాకు రమేశ్, గొల్ల సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో రాజీనామాలు

- తాండూర్, బెల్లంపల్లి మండలాల అధ్యక్షులు పార్టీని వీడి బయటకు..
- అభ్యర్థి తీరుపై అసహనం..



తాండూర్: రాజీనామా చేసిన మహీదర్‌గౌడ్

తాండూర్, నవంబర్ 6 : భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, తాండూర్ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు రామగౌని మహీదర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. పార్టీ బూత్‌స్థాయి నుంచి బలోపేతానికి ఎంతో కష్టపడి పని చేస్తే, మండల అధ్యక్ష పదవికి విలువ ఇవ్వడం లేదని వాపోయారు. బెల్లంపల్లి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమరాజుల శ్రీదేవి నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో సంబంధంలేని వారికి, దగ్గరి వ్యక్తులను నమ్ముకొని పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా తిరుగుతున్నారని విమర్శించారు. మండలాధ్యక్షులకు సంబంధం లేకుండా జాయినింగ్ చేస్తూ అధ్యక్షులకు విలువ ఇవ్వడం లేదని ఆరోపించారు. పార్టీ టికెట్ అనౌన్స్ అయి నేటికి సుమారు 20 రోజులు గడిచినా ప్రచారం మొదలు పెట్టలేదని తెలిపారు. భారతీయ జనతా పార్టీ పరిస్థితి రోజురోజుకూ దిగజారి పోతున్నదని, బెల్లంపల్లి నియోజకవర్గంలో గెలిచే పరిస్థితి లేదని పేర్కొన్నారు. పార్టీలో విలువలేని చోట తాము ఉండలేమని, అందుకే తమ కార్యకర్తలతో సహ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

### బెల్లంపల్లి మండలాధ్యక్షుడు..

బెల్లంపల్లి రూరల్, నవంబర్ 6 : బీజేపీ సభ్యత్వానికి ఆ పార్టీ బెల్లంపల్లి మండలాధ్యక్షుడు గజెల్లి రాజ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి గాదర్ల నగేశ్, మండల ఉపాధ్యక్షుడు గజెల్లి రఘు రాజీనామా చేశారు. నియోజకవర్గ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి నియోజకవర్గంలోని మండలాల్లో పార్టీకి సంబంధం లేని వ్యక్తులను నమ్ముకొని, పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా జాయినింగ్ కార్యక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. టికెట్ కేటాయించి 20 రోజులు కావస్తున్నా ప్రచారం ప్రారంభించడం లేదని, పార్టీలో విలువలు లేకుండా పోయాయని వారు అన్నారు. బీజేపీలో తమకు ఇప్పటి వరకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, నాయకులు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# మూడో రోజు ఏడు..

**ఆసిఫాబాద్ జిల్లాలో ఒకటి, మంచిర్యాల జిల్లాలో 6 నామినేషన్లు దాఖలు**

నస్పూర్/గర్మిళ్ల/చెన్నూర్/బెల్లంపల్లి, నవంబర్ 6 : మంచిర్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థులుగా జన్నారం మండలం దేవునిగూడ గ్రామానికి చెందిన గవ్వల శ్రీకాంత్, జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీకి చెందిన రంగు మల్లేశ్, ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి నస్పూర్ మండలం శ్రీరాంపూర్‌కు చెందిన నయీం పాషా తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, మంచిర్యాల ఆర్డీవో రాములుకు అందజేశారు. చెన్నూర్ నియోజకవర్గానికి సంబంధించి స్వతంత్ర అభ్యర్థిగా చకినారపు కిరణ్, బీజేపీ తరుపున జుమ్మిడి రాజేశ్ తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సిడాం దత్తుకు సమర్పించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా రాంటెంకి శ్రీనివాస్ తమ నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారి రాహుల్‌కు అందించారు. 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని అధికారులు తెలిపారు.

### సిర్పూర్ నియోజకవర్గంలో..

సిర్పూర్(టీ), నవంబర్ 6 : సిర్పూర్ నియోజకవర్గం నుంచి ఒక నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. ఇక్కడ బీజేపీ నుంచి పాల్వాయి హరీశ్ బాబు తరపున సిర్పూర్(టీ) జడ్పీటీసీ నీరటి రేఖ నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు రెండు నామినేషన్లు వచ్చినట్లు వివరించారు.